

'నవరత్న' నివాసాలు!
నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద ప్రభుత్వం ఏకంగా ఊళ్లే నిర్మిస్తోంది. ఈ పథకంపై లబ్ధిదారుల ఆనందం. - 8లో



బాధ్యతగా ఎన్నికల విధులు
రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. - 8లో



పకడ్బందీగా రేషన్ పంపిణీ
జిల్లాలోని కార్డుదారులకు పకడ్బందీగా రేషన్ పంపిణీ చేయాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

2న జాబ్ మేళా
తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని పద్మావతీపురంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణం వద్ద ఉప ఉపాధి కార్యాలయంలో డిసెంబరు 2వ తేదీ ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో మార్కెటింగ్ అండ్ రికవరీ ఉద్యోగాలకు ఏదేని డిగ్రీ/ఎంబీఏ విద్యార్హత, ఎంబీయూ సంస్థలో ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, ప్లంబర్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఐటీఐ విద్యార్హత, దావోస్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో జియో ఫైబర్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఏదేని ఐటీఐ/డిప్లొమో/డిగ్రీ విద్యార్హత గల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. ఆయా ఉద్యోగాలకు 18 నుంచి 30 ఏళ్లలోపు యువతీ యువకులు హాజరుకావాలని సూచించారు. ఆసక్తి గలవారు 7702300292, 7337278875 నంబర్లలో సంప్రదించాలని కోరారు. www.ncs.gov.in వెబ్‌సైట్లో పూర్తి వివరాలతో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు
తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 58,874 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 17,133 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.50 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఓటరు జాబితా ముద్రణకు ఆహ్వానం
తిరుపతి అర్బన్ : రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటరుజాబితా ముద్రించేందుకు ప్రింటింగ్ ప్రెస్ యజమానులు డిసెంబర్ 4వ తేదీలోపు బిడ్‌లను జేసీ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు తెలిపారు. బుధవారం ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ పూర్తి కాగానే ఓటర్ల తుది జాబితా అందిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జాబితా ముద్రించాల్సి ఉంటుందని వెల్లడించారు.

సంప్రదాయబద్ధంగా 'ఆకాశదీపం'



ఆకాశదీపాన్ని ఎగురవేస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం సంప్రదాయబద్ధంగా ఆకాశదీపం వెలిగించారు. ముందుగా ఊంజల్‌సేవ మండపం వద్ద కార్తీక దీపానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ఎగురవేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆహా ఏమి రుచి.. సేవించు మైమరచి!



వేడి వేడి తేనీరు సేవిద్దాం.. చాయ్ చమక్కులు చూద్దాం అని ఓ సినీ కవి చెప్పినట్లు పేదా..గొప్పా తారతమ్యం లేకుండా అందరికీ ఇవి ఇష్టమైన పానీయాలే అంటే అతిశయోక్తి లేదు. పొద్దున లేవగానే ఓ గుక్కెడు టీ తాగందే ఏ పనీ చేయని వారు చాలా మందే ఉన్నారు. కాస్త తలనొప్పి వచ్చినా వెంటనే టీ..కాఫీల వైపే మొగ్గుచూపుతుంటారు. ఇంటికి అతిథులు వస్తే టీ..కాఫీతోనే స్వాగతం పలుకుతుంటారు. నలుగురు స్నేహితులు కలిస్తే తేనీటి విందుతోనే మాటలు మొదలుపెడుతుంటారు. ఒక్క కప్పు లోపల పడితే ఆ ఉత్సాహమే వేరబ్బా అంటూ టీ..కాఫీలను అన్ని వయసుల వారు ఆస్వాదిస్తుంటారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విభిన్నరీతుల్లో కాఫీ షాపులు వెలుస్తున్నాయి. ఫ్రాంచైజీలతో సరికొత్తగా టీ దుకాణాలు ఆహ్వానం పలుకుతున్నాయి.

కాఫీ ఘుమ ఘుమలు.. చాయ్ చమక్కులు
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఫ్రాంచైజీ షాపులు
- స్పెషల్ టీ..కాఫీలకు భలే క్రేజ్
- వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టు తయారీ

సాక్షి, తిరుపతి : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేలకు పైగా టీ షాపులున్నాయి. ఇందులో సొంతంగా యజమానులే నిర్వహించుకునే షాపులు 22 వేలకు వరకు ఉండగా 6వేల వరకు ఫ్రాంచైజీలతో నడుస్తున్నాయి. 2వేల మంది వరకు హోటళ్లు, చిల్లర దుకాణాల్లో టీ దుకాణాలు నడుపుకుంటున్నారు. గతంలో పట్టణ ప్రాంతాల్లో మాత్రమే ఈ టీ కొట్టులుండేవి. కాలక్రమేణా ఇవి పెరుగుతూ వచ్చాయి. సాధారణ టీ షాపులతో పాటు.. రకరకాల టీ హబ్‌లు పుట్టుకొచ్చాయి. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా పెద్ద సంఖ్యలో షాపులు వెలిశాయి. విభిన్నంగా ఆకట్టుకునే అలంకరణలతో, ఫ్రాంచైజీల పేరిట కొత్త రకం టీ, కాఫీ షాపులు ప్రజలను కట్టిపడేస్తున్నాయి.

రకరకాల తేనీరు

ఒకప్పుడు టీ, కాఫీలను కొంత మంది మాత్రమే తాగేవారు. ఇప్పుడు 99 శాతం ఆనందంగా సేవిస్తున్నారు. రుచితో పాటు ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా టీ, కాఫీలు తయారు చేస్తున్నారు. సాధారణ టీ, బెల్లం టీ, అల్లం టీ, ఇరానీ టీ, గ్రీన్, లెమన్, వైట్, పిస్తా, బాదం, సొంటి–మిరియాలు, మసాలా, ధమ్ చాయ్ ఎన్నో వెరైటీలు అందుబాటులోకి వచ్చాయి. పేపర్ కప్పులతో పాటు మట్టి పాత్రలు, వివిధ రకాల డిజైన్ గాజు గ్లాసుల్లో టీ..కాఫీలను అందిస్తున్నారు. వీటితో పాటు కొత్తగా మునగాకు టీ, బొప్పాయి, తులసి, వేప, పుదినా, కాకరకాయ టీలతో పలువురిని ఆకర్షిస్తున్నారు.



ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన టీ దుకాణం

ఆకట్టుకునేలా షాపులు

మారుతున్న ప్రజల జీవనశైలికి అనుగుణంగా ఫ్రాంచైజీ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఆకట్టుకునేలా షాపులను తీర్చిదిద్దుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి మరీ ప్రసిద్ధి చెందిన టీ..కాఫీ షాపులను పలువురు ఫ్రాంచైజీ తీసుకుని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. చూడముచ్చటగా ఉండే ఈ దుకాణాల్లో తేనీటి రుచులను ఆస్వాదించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

ప్రయోజనాలు ఎన్నో..

మానవాళికి ప్రకృతి ప్రసాదించే ప్రతి ఒక్కటీ ఏదో రకంగా మేలు చేస్తుంది. తేయాకు అందుకు మినహాయింపు కాదు. విదేశాల నుంచి ఇక్కడకు వచ్చిన తేయాకు.. నేడు మనదేశం నుంచే ఇతర దేశాలకు ఎగుమతి అవుతోంది. ప్రపంచ తేయాకు ఉత్పత్తిలో మన దేశం ప్రథమ స్థానంలో ఉంది. అంటే అటు ఉత్పత్తిలోనూ, ఇటు వినియోగంలోనూ టీ ఆకు మన సమాజంతో పెనవేసుకుపోయింది. వివిధ రకాల మూలికలతో ఉపయోగాలు ఉన్నట్లు ..తేయాకుతో కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పరిమితంగా టీ సేవిస్తే క్యాన్సర్ నిరోధకత పెరుగుతుందని ఓ పరిశోధనలో వెల్లడైంది. ఎంత తాగాలి అనిపించినా టీ..కాఫీలను పరిమితంగానే తీసుకోవాలని వైద్యులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చౌకగా లభిస్తుంది కదా అని కప్పుల కొద్దీ ఖాళీ చేస్తే అజీర్ణంతో పాటు నిద్రలేమి వంటి ఇతర సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయని హెచ్చరిస్తున్నారు.



చాయ్ సేవిస్తున్న యువకులు



టీ కలుపుతున్న మహిళలు



ఆకట్టుకునేలా అలంకరణ

పాగాలిలో ఇండస్ట్రియల్ పార్క్

- వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : ఏర్పేడు మండలం పాగాలి గ్రామం వద్ద కొత్త ఇండస్ట్రియల్ పార్క్ బ్లాక్–2 నిర్మాణ పనులకు బుధవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి ఎంపీ గురుమూర్తి, జేసీ బాలాజీ, పరిశ్రమలశాఖ జీఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు జిల్లా నిలయంగా మారిందన్నారు. ప్రభుత్వం సైతం సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తోందని వెల్లడించారు. జేసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి భూమి పూజ చేసిన పారిశ్రామిక పార్క్‌నకు కేంద్ర పరిశ్రమల శాఖ ద్వారా సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల క్లస్టర్ డెవలప్‌మెంట్ కింద అనుమతులు వచ్చాయన్నారు. 44.11 ఎకరాల్లో ఏర్పాటుకానున్న ఈ పార్క్‌లో మౌలిక వసతులు కల్పించి, పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 70శాతం గ్రాంట్ కింద రూ.7.21 కోట్లు , రాష్ట్ర ప్రభుత్వం 30శాతం వాటా కింద రూ.3.09 కోట్లు అందించినట్లు వివరించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ జెడ్‌ఎం జవహర్‌బాబు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో ఎంపీ గురుమూర్తి తదితరులు

ఫారం–7 తప్పని తేలితే కేసులు

తిరుపతి అర్బన్ : ఓటు తొలగింపునకు అందించిన ఫారం–7 తప్పుడు సమాచారమని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొబైల్, కంప్యూటర్ ద్వారా తప్పుడు దరఖాస్తు సమర్పించినా ఐపీ అడ్రస్ ఆధారంగా నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆర్‌ఓలు క్షేత్రస్థాయి పరిశీలనలో తప్పుగా తేలిన దరఖాస్తులను వెంటనే పోలీసుశాఖకు అప్పగించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు అన్ని రకాల ఓటరు దరఖాస్తులు 3,52,198 అందాయని, వాటిలో 7,425 పరిశీలించాల్సి ఉందని, ఫైనల్ రోల్ ప్రకటన సమయానికి వందశాతం పూర్తిచేస్తామని వివరించారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు సంబంధిత మొబైల్ వాహనాలు అన్ని నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. అలాగే కలెక్టరేట్ , తిరుపతి నగరపాలక సంస్థ, ఆర్‌డీఓ కార్యాలయాల్లో కూడా మొబైల్ వాహనాలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేత చంద్రమౌళి, బీజేపీ నేత పురుషోత్తం నాయుడు, సీపీఐ నేత నాగరాజు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్‌డీఓలు శివశంకర్ రెడ్డి, చంద్రముని, తహసీల్దార్లు శిరీష, సుబ్రమణ్యం, ఎన్నికల సెక్షన్ అధికారులు లక్ష్మీపతి , పవన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

జోరు వాన



రేణిగుంట మండలం తారకరామనగర్‌లో వర్షపు నీరు

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- జిల్లా అంతటా కురుస్తున్న వర్షం
- రేణిగుంటలో అత్యధికంగా 37.2 మి.మీ
- బీఎన్ కండ్రిగలో అత్యల్పంగా 2 మి.మీ
- సముద్రతీరంలో ఈదురుగాలులు
- ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు

తిరుపతి అర్బన్ : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు నీటితో నిండుతున్నాయి. పలు చోట్ల వాగులు, వంకలు, కాలువలు, నదులు ఉప్పొంగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. సేద్యానికి అనువుగా వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మామూలుగా నవంబర్‌లో 288.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 186.3 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పూర్తిస్థాయిలో నమోదయ్యే అవకాశముంటుందని వివరిస్తున్నారు. అల్పపీడనం నేడో రేపో వాయుగుండంగా మారుతుందని వాతావరణశాఖ ప్రకటించడంతో డిసెంబర్ మొదటివారంలో మరింత భారీ వర్షాలు కురిస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు. గత రెండు రోజుల్లో జిల్లాలో అత్యధికంగా రేణిగుంటలో 37.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా బుచ్చినాయుడు కండ్రిగలో 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ప్రకటించారు. నాగలాపురం మండలం టీపీ కోట–నాగలాపురం మార్గంలో ఎస్‌ఎస్ పురం వద్ద మంగళవారం రాత్రి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



నాగలాపురం మండలంలో తెగిపోయిన రోడ్డు

అల్లకల్లోలంగా సముద్రం

వాకాడు : మండలంలోని తూపిలిపాళెం వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. సముద్రం 4 మీటర్లు వరకు ముందుకు వచ్చింది. తీరంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. తూపిలిపాళెం, పామంజి, కొండూరుపాళెం, దుగరాజపట్నం, అంజలాపురం, శ్రీనివాసపురం, పంబలి, మొనపాళెం, ఓడపాళెం, వైట్‌కుప్పం, పూడికుప్పం, చినతోట, పూడిరాయిదొరువు, నవాబుపేట తదితర తీరప్రాంత గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మత్స్యకారులు వేటను నిలుపుదల చేసి ఒడ్డుకు చేరుకున్నారు.

అడవిలో చిక్కుకున్న భక్తులు.. కాపాడిన అధికారులు

రాపూరు : మండలంలోని పెంచలకోనలో బుధవారం జలపాతం వద్దకు వెళ్లిన భక్తులు భారీ వరద రావడంతో అక్కడే చిక్కుకుపోయారు. రెండురోజులుగా కుస్తున్న వర్షాలకు వెలుగొండ అడవుల్లో జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాటిని చూసేందుకు కొందరు భక్తులు వెళ్లారు. అందులో 11 మంది తిరిగి రాలేకపోయారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, ఆలయ సిబ్బంది, స్థానికులతో కలిసి అడవిలోకి వెళ్లి భక్తులను కాపాడి వెలుపలకు తీసుకువచ్చారు.

గోడ కూలి పశువుల కాపరి మృతి

తడ: మండలంలోని బీవీపాళెం గ్రామానికి చెందిన రాజామణి(44) అనే పశువుల కాపరి బుధవారం ప్రహరీ గోడ కూలి మీద పడడంతో మృతి చెందాడు. వివరాలు.. రాజామణి తన భార్యతో కలిసి గేదెలు మేపేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. రాజామణితోపాటు కొన్ని గేదెలు కూడా గోడ కింద పడి మరణించినట్లు వెల్లడించారు. ఆయన భార్య మాత్రం కొంత దూరంలో వస్తుండటంతో ప్రమాదం నుంచి బయట పడిందని వివరించారు.

దంపతులను రక్షించిన రెస్క్యూ టీమ్

రేణిగుంట : తొట్టంబేడు మండలంలోని కారాకొల్లు వాగు దాటుతూ నీటి ఉధృతికి కొట్టుకుపోతున్న దంపతులను పోలీసులు, రెస్క్యూ టీమ్ రక్షించి ఒడ్డుకు చేర్చారు. రెండు రోజులుగా భారీ వర్షాలకు వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కారాకొల్లు గ్రామానికి చెందిన చిన్నబత్తెయ్యనాయుడు(53), ఆయన భార్య నాగరత్నమ్మ(45) ఇంటికి వెళ్లేందుకు ఒకరినొకరు పట్టుకుని వాగులోకి దిగారు. కొద్దిదూరం వెళ్లాక నీటి ఉధృతి పెరగడంతో కొట్టుకుని పోయి ఓ విద్యుత్ స్తంభాన్ని పట్టుకుని రక్షించాలంటూ కేకలు వేశారు. దీంతో స్థానికులు తహసీల్దార్ సుధీర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన వెంటనే రెస్క్యూ టీమ్‌ను తీసుకెళ్లాలని పోలీసులు, అగ్నిమాపక సిబ్బందిని ఆదేశించారు. వారు వాగు వద్దకు చేరుకుని దంపతులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

వాగులో కొట్టుకుపోయిన మహిళ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడు కండ్రిగలో బుధవారం ప్రమాదశాత్తు వాగులో కొట్టుకుపోయి ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. స్థానిక ఎస్సీకాలనీకి చెందిన జి.సాయమ్మ(54) పశువులను మేత కోసం ఏర్పేడు మండలం బత్తినయ్యకాలనీ సమీపంలోకి తోలుకెళ్లింది. మధ్యాహ్నం నుంచి జోరుగా వర్షం కురుస్తుండటంతో సమీపంలోని పంబ కాలువలో నీటి ఉధృతి పెరిగింది. పశువులు వాగును దాటేశాయి. వాటిని వెంబడిస్తూ వాగులో దిగిన సాయమ్మ కొట్టుకుపోయింది. వెంట ఉన్న పశువుల కాపరులు వెంటనే ఆమెను కాపాడేందుకు ప్రయత్నించగా అప్పటికే మరణించింది.



సాయమ్మ మృతదేహం



తూపిలిపాళెం వద్ద ఎగసిపడుతున్న అలలు



వాకాడులో ఈదురు గాలులు



ఉధృతంగా ప్రవహిస్తున్న కైవల్యానది



నిండుగా ప్రవహిస్తున్న చిట్టత్తూరు వాగు



దంపతులను రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చిన రెస్క్యూ టీమ్



సురక్షితంగా తీసుకువచ్చిన భక్తులతో పోలీసులు



ఉప్పొంగుతున్న కారాకొల్లు వాగు

నవరత్న నివాసాలు!

నిరుపేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేసింది. అద్దె చెల్లించే అవస్థలను తప్పించింది. అత్యాధునిక మౌలిక వసతులతో తీర్చిదిద్దిన జగనన్న లేఅవుట్‌లలో ఆశ్రయం కల్పించింది. అక్కచెల్లెమ్మల పేరిట ఆస్తిని సమకూర్చింది. ప్రజా సంక్షేమమే పరమావధిగా ఏకంగా ఊళ్లే నిర్మించింది. వేలాది నివాసాలను కళ్ల ఎదుట ఆవిష్కరించింది. ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్ల పొందిన లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే..

– తిరుపతి అర్బన్

జనవాక్కు



వడమాలపేటలోని కాయం జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు

అద్దె బాధ తప్పింది



ఇన్నేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెళ్లదీశాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల పథకంలో స్థలంతో పాటు ఇల్లు మంజూరైంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని నూతన గృహప్రవేశం కూడా చేశాం. సొంతింటిలో ఎంతో ధైర్యంగా ఉంది. ఇప్పటికి అద్దె చెల్లించాల్సిన బాధ తప్పింది. ఇలాంటి ప్రభుత్వమే ప్రజలకు కావాల్సింది. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి.

- సుశీలమ్మ, గాజులపెళ్లూరు, బుచ్చినాయుడుకండ్రిగ మండలం

సంతోషంగా ఉంది



సొంతిల్లు లేక ఏళ్ల తరబడి నానా ఇక్కట్లు పడ్డాం. ఇప్పటి పరిస్థితుల్లో స్థలం కొనుగోలు చేసి, ఇల్లు నిర్మించుకోవడం కలగానే ఉండేది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్ మాతో దరఖాస్తు చేయించి ఇంటి పట్టాను ఇప్పించారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో సొంతిల్లు నిర్మించుకున్నాం. ఇది మా ఇల్లు అనుకుంటే చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- నాగరత్న, దిగువరెడ్డిగారిపల్లె, చంద్రగిరి మండలం

కల నేరవేరింది



కూలీ పనులు చేసుకుని అద్దె ఇంట్లో కాలం వెళ్లదీసేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న లే అవుట్‌లో మాకు ఇంటి స్థలం అందించింది. తర్వాత పక్కా ఇల్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేసింది. మాకు నచ్చిన రీతిలో ఇంటిని నిర్మించుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో మా సొంతింటి కల నెరవేరింది. అలాగే అమ్మ ఒడి కింద నగదు అందించింది. మా కుమారుడికి బైజూస్ ట్యాబ్ ఇచ్చింది. ఇంత మేలు చేసిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

- ఎస్‌కే మాబున్నీసా, గూడూరు రూరల్

రుణపడి ఉంటాం



అద్దె ఇంట్లో సుమారు 20 ఏళ్లుగా ఉండేవాళ్లం. నిరుపేదలైన మాకు సొంతిల్లు అనేది కలగానే ఉండేది. ఆ సమయంలో ప్రభుత్వం నాయుడుపేట సమీపంలోని బిరదవాడ వద్ద జగనన్న లేఅవుట్‌లో మాకు ఇంటి స్థలం మంజూరు చేసింది. రూ.1.8 లక్షల రుణం ఇప్పించింది. సర్కారు సాయంతో ఇల్లు నిర్మించుకున్నాం. దశాబ్దాల కలను నెరవేర్చిన సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. **- నల్లబోతుల లక్ష్మి, నాయుడుపేట**

మేలు మరువలేం



ఏళ్ల తరబడి సొంతిల్లు లేక నానా అవస్థలు పడ్డాం. మాకు వచ్చే కొద్దిపాటి సంపాదనలో అద్దె చెల్లించేందుకు కూడా ఇబ్బంది పడేవాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అలని వెంకటగిరి జగనన్న కాలనీలో మాకు ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం చేయూతనందించడంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ఇప్పుడు చీకూ చింత లేకుండా సొంతింటిలో నివసిస్తున్నాం. జగనన్న మేలును ఎన్నటికీ మరువలేం.

బి.లక్ష్మమ్మ, వెంకటగిరి.

సంక్షేమం.. అభివృద్ధికి కేరాఫ్ ఏపీ



పూడిలో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: జగనన్నతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, సంక్షేమానికి, అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం వడమాలపేట మండలం పూడి సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రోజా ఆ గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ముందుగా పూడి సచివాలయ ఆవరణలో నేటి ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా చేసిన సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. అనంతరం కాయం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంతకం చేసిన క్షణం నుంచి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనకు, 2019 నుంచి 2024 వరకు జగనన్న పాలనకు గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రానికి సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని, అందుకు జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల లబ్ధితో ప్రతి పేదవాని మోములో ఉన్న చిరునవ్వు శాశ్వతం కావాలంటే జగన్ మళ్లీ రావాలని తేల్చి చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తోందని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనికట్టుకుని ప్రచారం చేస్తుందన్నారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి, ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని ఆరోపించారు. అదే జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని రాసిన బోర్డులను గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నగరి నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, కాణిపాకం పాలకమండలి సభ్యురాలు ప్రతిమ, పార్టీ నాయకులు సురేష్‌రాజు, చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, మునిబాబు, ఉమాపతి, రామిరెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం రాయాలంటే పాండిత్యం ఉండాలి

తిరుపతి సిటీ: సంస్కృతం కంటే తెలుగు భాషలో కవిత్వం రాయడం కష్టతరమని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్య కొంపెల్ల రామ సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో జాస్తి సూర్యనారాయణ ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత సాహిత్యం–ఉత్తర రామ చరిత వైశిష్ట్యం అనే అంశంపై కార్యక్రమాన్ని ఆయన ఇన్ చార్జి వీసీ ఆచార్య జీఎం సుందరవల్లితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో కవిత్వం రాయాలంటే సంస్కృతం, తెలుగు భాషల్లో పాండిత్యం ఉండాలన్నారు. వేదం భారతీయ సాహిత్యానికి నీటి చెలమని, పురాణ సాహిత్యం ప్రేమ మయమని, కావ్యాలు రసమయమని అన్నారు. భవభూతి రాసిన ఉత్తరం రామచరితం కరుణరస భరితమైందని, ఏకో రసం: కరుణమేవ అనే విధంగా కవి మలిచారని అన్నారు. సీతారాముల పరస్పర అనురాగాన్ని, అరమరికలు లేని దాంపత్య జీవితాన్ని మనస్సును తాకే విధంగా వివరించారు. తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ, ప్రొఫెసర్లు శ్రీనివాసులురెడ్డి, దామోదరనాయుడు, సర్వోత్తమ రావు, డాక్టర్ సునీల్, డాక్టర్ ఆదిశేషయ్య, అశోక్ , పరిశోధకులు పాల్గొన్నారు.



రామ సూర్యనారాయణను సన్మానిస్తున్న వీసీ, అధ్యాపకులు

మరింత బాధ్యతగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

– క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, ఇందుకోసం సన్నద్ధం కావాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథిగృహంలో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు సర్వం సిద్ధం చేసుకోవాలని సూచించారు. జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. చిన్నారులు, మహిళలకు సంబంధించిన కేసుల్లో సత్వరమే స్పందించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. విక్రేత నుంచి వినియోగదారుడి వరకు క్రిమినల్ కేసులతోపాటు పీడీ యాక్ట్ నమోదు చేయాలని స్పష్టం చేశారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కషి చేయాలన్నారు. రౌడీ షీటర్లకు నిరంతరం కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో పరివర్తన తీసుకురావాలని కోరారు. నేర నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మిస్సింగ్ కేసులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి దర్యాప్తు చేయాలని సూచించారు. కోర్టు ఆదేశాలు లేకుండా సివిల్ వివాదాల్లో తలదూరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. నేషనల్ హైవేల్లో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. మానవ హక్కుల ఉల్లంఘన వంటి సున్నితమైన అంశాలు ఉన్న ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర దర్యాప్తుతో కోర్టుకు నివేదిక సమర్పించాలని తెలిపారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఎర్రచందనం, సారా, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు, శేఖర్ విమల కుమారి, సబ్ అడిషనల్ ఎస్పీ రాజేంద్ర పాల్గొన్నారు

చంద్రబాబువి గారడీ పథకాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: వచ్చే ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకు చంద్రబాబు నాయుడు ప్రకటిస్తున్న గారడీ పథకాలను నమ్మవద్దని వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని ఓఎన్ కొత్తూరులో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత గ్రామంలో పార్టీ జెండా, పంచాయతీలో చేసిన అభివృద్ధి పనుల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత గత నాలుగున్నరేళ్లలో వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమానికి నియోజకవర్గంలో రూ.కోట్ల ప్రభుత్వం వ్యయం చేసిందన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ నవరత్న పథకాల ఫలాలు ఇళ్ల ముంగిటకే అందిస్తోందన్నారు. ఇదే గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే అందేవని, అది కూడా అధిక భాగం పార్టీ కార్యకర్తల జేబుల్లోకి వెళ్లేవన్నారు. తమ ప్రభుత్వం పాలనలో ఈ తేడాను ప్రజలు స్పష్టంగా గమనించవచ్చన్నారు. గతంలో చంద్రబాబు ఎన్నికల్లో గెలిచేందుకు 200 హామీలు ఇచ్చారని, గెలిచిన తర్వాత ఆ హామీలు గాలికొదిలేసి ప్లేటు ఫిరాయించారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ప్రజలను వంచించేందుకు సిద్ధమయ్యారని, ఇంటింటా గ్యారంటీ కరపత్రాలు ఇచ్చి మోసం చేస్తారన్నారు. చెప్పిన మాట నిలబెట్టుకున్న జగనన్నను ఆదరిస్తే అందరూ బాగుపడడంతోపాటు పిల్లలకు కూడా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణమూర్తి, సర్పంచ్ దేవప్పనాయుడు, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నవ వధువు మృతి

తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి ఓ నవ వధువు మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. తిరుమల వన్ టౌన్ ఎస్‌ఐ సుధాకర్ కథనం మేరకు.. విజయవాడ చెందిన రమేష్, సుధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు . పెద్ద కుమార్తె సంతోషికి ఈనెల 23వ తేదీన హైదరాబాద్‌కు చెందిన యువకుడితో వివాహమైంది. నూతన వధూవరులు శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు నవ దంపతులు తమ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు రాగానే సంతోషి హఠాత్తుగా కళ్లు తిరిగి పడిపోయింది. టీటీడీ భద్రతా సిబ్బంది వెంటనే ఆమెను అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రిలోని అపోలో ఎమెర్జెన్సీ క్లినిక్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సంతోషి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుంటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడగా.. అమ్మాయికి చిన్నప్పటి నుంచి అధికంగా అలసిపోతే ఊపిరాడదని, ఈ క్రమంలోనే మృతి చెంది ఉండవచ్చునని తెలిపారు. మృతదేహాన్ని రాత్రి 7 గంటలకు టీటీడీ అంబులెన్స్‌లో వారి స్వస్థలానికి తరలించారు.

పంటలపై ఏనుగుల దాడి

బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లె అటవీ సమీప పొలాల్లో మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దాడులు చేసి, వరి, బీన్స్, టమాట పంటలను ధ్వంసం చేశాయి. వెంగంవారిపల్లె గ్రామానికి చెందిన భాస్కర్ సాగు చేసిన 2 ఎకరాల వరి పంటను తొక్కి నాశనం చేశాయి. అలాగే వెంకటేష్ సాగు చేసిన టమాట, రత్నప్పకు చెందిన బీన్స్ పంటలను ధ్వంసం చేశాయి. పంటలు చేతికందే సమయంలో ఏనుగుల గుంపు తొక్కినాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పూతలపట్టు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంభూపాల్ కథనం మేరకు.. వి.కోట మండలం చింతలగుంట గ్రామానికి చెందిన కుమారరాజా కుమారుడు ఆర్.పవన్‌కళ్యాణ్(25) మంగళవారం రాత్రి పూతలపట్టు మండలంలోని రంగంపేట ఫ్లైఓవర్ వద్ద సర్వీసు రోడ్డును దాటుతుండగా అటువైపు వెళుతున్న కారు ఢీకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పవన్‌కళ్యాణ్ మృతికి కారణమైన వ్యక్తి పాకాల మండలానికి చెందిన హరినాథ్‌గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పకడ్బందీగా రేషన్ పంపిణీ



మాట్లాడుతున్న పౌరసరఫరాలశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : కార్డుదారులకు సకాలంలో పకడ్బందీగా రేషన్ పంపిణీ చేయాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీలోపు బియ్యంతోపాటు ఇతర సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేయాలన్నారు. డిసెంబర్ నుంచి కేజీ రాగులు అందించాలని స్పష్టం చేశారు. కార్డుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. ఎండీయూ వాహనం వచ్చే ముందు రోజే వలంటీర్ల ద్వారా కార్డుదారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యరక్షణే పరమావధిగా ప్రభుత్వం నాణ్యమైన సార్టెక్స్ బియ్యం పంపిణీ చేస్తోందని వివరించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదాముల వద్ద సరుకుల తూకం తక్కువగా ఉంటోదని డీలర్లు ఫిర్యాదు చేస్తున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బాలాజీ, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజారఘువీర్, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ సుమతి, డీఈఓ శేఖర్, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పెంచల కిషోర్

తిరుపతి అర్బన్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కృషి చేయాలని డీఆర్‌ఓ పెంచలకిషోర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు సమష్టిగా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రధానంగా గోల్డెన్ అవర్‌లో (ప్రమాదం జరిగిన గంటలోపు) క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించాలని కోరారు. గాయపడిన వారిని ఆ సమయంలో ఆస్పత్రిలో చేర్పించిన వారికి కేంద్రప్రభుత్వం ప్రకటించిన రూ.5వేలు అందజేస్తామని వెల్లడించారు. గోల్డెన్ అవర్‌పై వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఆయా చోట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌టీఓ సీతారామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా ఆర్టీసీ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, టౌన్‌ప్లానింగ్ అధికారి మధుసూదన్, నేషనల్ హైవే పీడీ వెంకటేశ్వర్లు, ఎన్‌హెచ్ డీఈ నాగరాజు పాల్గొన్నారు.